



కర్నూలు నగరంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చెలరేగిపోతున్న ఇసుక మాఫియా

- లక్ష్మీపురం సరిహద్దుల్లో హంద్రీ నుంచి అక్రమ రవాణా
- నిద్రపోతున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు
- నీటి నిల్వ కొరత తీవ్రంగా నష్టపోతామంటున్న దొడ్డిపాడు ప్రజలు

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

జిల్లాలో ఇసుక రీచ్‌ల నుంచి కాకుండా హంద్రీనదిలో యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణాకు మాఫియా శ్రీకారం చుట్టింది. తుంగభద్ర నదికి వరద నీరు రావడంతో ఇసుక రవాణాకు అడ్డుకట్టబడింది. ఇసుక మాఫియా హంద్రీనదిపై కన్నేసింది. కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామ శివారులో హంద్రీ నదిలోకి 20 నుంచి 30 ట్రాక్టర్లు దిగుతూ ఇసుక అక్రమ రవాణాకు మాఫియా బరితెగించింది. ఏరియా ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారులు పోలీసు సిబ్బంది ఎవరు కూడా అటువైపు కన్నెత్తి చూడకుండా మాఫియా డబ్బు వెదజల్లి కట్టడి చేసింది. ఇది మాఫియాకు రాత్రి పగలు అని తేడా లేకుండా అడ్డు అదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. వేలాది రూపాయలు దండుకుంటున్న ఇసుక మాఫియా అటుగా ఎవరైనా అభ్యంతరం చెప్పేందుకు వస్తే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. హంద్రీ నది నుంచి ఇసుక అక్రమంగా తరలి పోతున్నా హంద్రీ పరివాహక కమిటీ సభ్యులు కూడా ఘాడనిద్రలో ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక తరలిపోవడంతో నదిలో నీటి నిల్వలు లేకుండా పోతున్నాయిని దొడ్డిపాడు, పెద్దటేకూరు గ్రామాల రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలించే మాఫియాపై అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం నోరు మెదపకపోవడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు హంద్రీనది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక తరలిస్తే నీటి నిలువలు తగ్గుతుంది

- వెంకటరెడ్డి రైతు దొడ్డిపాడు గ్రామం



హంద్రీ నదిలోంచి ఇసుకని తరలిస్తే భూగర్భ జలాలు,నీటి నిల్వలు తగ్గిపోతాయని. దీంతో రైతులు పొలాలకు సాగునీరు కోసం వేసుకున్న బోర్లు ఎండిపోతాయి. క్రమంగా నది పరివాహక ప్రజలకు తాగునీరు కూడా కష్టమవుతుందన్నారు. గత కొన్ని ఏళ్లుగా హంద్రీ నుంచి ఇసుక తరలింపును ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకుంటున్నారు. ప్రస్తుతం లక్ష్మీపురం గ్రామం నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నదిలోకి దిగి ఇసుక తరలిస్తూ అక్రమ సంపాదనకు తెగబడ్డారు. నదికి సమీపంలో వేసిన వెంచరును ఓ ప్రముఖ వ్యక్తి కొనుగోలు చేసి హంద్రీ నుంచి ఇసుక రవాణా చేయిస్తున్నారు. ఒక ట్రాక్టర్కు 500 చొప్పున వసూలు చేస్తున్నారు. దీనిపై పోలీసులు రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి శిక్షించాలి.

ట్రాక్టర్లు రాకపోకలతో రహదారి పాడవుతుంది

- బాబయ్య ,దొడ్డి పాడు, కల్లూరు మండలం



లక్ష్మీపురం నుంచి దొడ్డి పాడు గ్రామానికి ఇటీవలనే రూ 40 లక్షలు ఖర్చుచేసి బిటి రోడ్డు వేయించారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండటంతో బిటి రోడ్డు గుంతలు పడుతుంది. ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం వేసిన రోడ్డు అక్రమార్కుల ఆదాయం కోసం తమ ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లను నడుపుతూ రాకపోకలు సాగిస్తూ రహదారిని దెబ్బతీస్తున్నారు. ట్రాక్టర్ల ను కట్టడి చేసి రహదారిని కాపాడాలి.

ఘనంగా బక్రీద్ వేడుక

- పేదల పట్ల కరుణ, దయ చూపడమే బక్రీద్ ప్రత్యేకత
- ప్రత్యేక సందేశంలో ఖాజీ సయ్యద్ సలీంబాష

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేదల పట్ల కరుణ, దయ చూపి అందరిని ఆలింగనం చేసుకొని అన్నదమ్ముల వలె కలిసి ఉండాలని సందేశం ఇచ్చు పండగ బక్రీద్ అని ఖాజీ సయ్యద్ సలీం బాష అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని పాత ఈద్గాహ్ కర్నూలు లో ఖాజీ సయ్యద్ సలీం బాష, కొత్త ఈద్గాహ్ సంతోష్ నగర్ లో ముఫ్తి సయ్యద్ మన్సూర్ అహ్మద్, లతీఫ్ లావుబాలి దర్గా మసీదులో డాక్టర్ ముఫ్తి సయ్యద్ ఆరిఫ్ పాషా ఖాద్రి, రోజా దర్గా ఇషాకియా మసీదు లో సయ్యద్ , గడ్డ ఈద్గాహ్‌లో హాఫిజ్ ఇస్మాయిల్ ఉమ్రి, జొహరాపురం ఈద్గాలో హషీమ్ జామాయి , జిబి.మసీద్ లో సయ్యద్ మహమూద్ హూసైనీ పీర్ లు ఈదుల్ అదః బక్రీద్ పండగ నమాజు తరువాత పండగ ప్రత్యేకతను గురించి వివరించారు. అందరి గురించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేశం సుభిక్షంగా ఉండాలని అందరూ హిందూ, ముస్లిం, సిక్, ఈసాయిలు అన్నదమ్ముల వలె మెలిగి ఆనందమయ జీవితాలు గడపాలని ఆకాంక్షించారు. శాంతి సౌభ్రాతృత్వాన్ని కలిగి ఉండాలని బక్రీద్ పండగ సందర్భంగా పాత ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దువాలో పాల్గొన్న వైసిపి మాజీ ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ ప్రత్యేక ధ్రువ అనంతరం ముస్లిం మత పెద్దల తో ప్రజలతో ఆ లింగం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల అనంతరం అందరూ హిందూ ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ముస్లింలు హిందువులను తమ ఇండ్లకు పిలిచి షీర్‌కుర్మా, బిర్యానీలను ఆరగించేందుకు ఆహ్వానించారు. స్తోమత గలవారు పొట్టేలు, ఎద్దు, ఒంటె, లను వదించి వాటి మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగం ఇంటివారికి రెండవ భాగం బంధువులకు మూడవ భాగం పేదలకు పంచిపెట్టి తమను దాతృత్వాన్ని చాటుకున్నారు. **వెల్దుర్తి**లో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మసీదులు ఈద్గాలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదిన విశిష్టత గురించి ముస్లిం పెద్దలు ఉపన్యాసం చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంతోషంగా గడిపారు. **సిబెళగల్** మండలంలోని గ్రామాలలో ఘనంగా బక్రీద్ పండగ ఈద్గాలలో నిర్వహించారు. బక్రీద్ పండగ హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ సందర్భంగా ముస్లింలు 'ఈద్ ముబారక్'. త్యాగ బుద్ధిని, నిజమైన భక్తిప్రపత్తులు కలిగి ఉన్నవారే దైవకపకు పాత్రులు అవుతారు అనే సూక్తిని బక్రీద్ మనకు తెలియజేస్తోందని వక్తను సూచించారు. ముస్లింలు ప్రత్యేక నమాజ్ చదివి ఒకరికొకరు అలింగనం చేసుకున్నారు. ముస్లిం సోదరులకు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎస్ఎంబాష, సి బెళగల్ ఉపసర్పంచి ఇబ్రహీం. బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.



తనిఖీలు చేపడుతున్న పోలీసులు

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

- కర్నూలు రేంజ్ డిఐజి, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుం దని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తది తర రోడ్డు భద్రత ప్రాముఖ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- ప్రథమంలో జిల్లా ఐదవ స్థానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో జిల్లా ఐదవ స్థానంలో నిలువగా ద్వితీయ సంవత్సరంలో జిల్లా 16వ స్థానంలో నిలిచింది.. జిల్లాలో ప్రథమ సంవత్సరంలో 5006 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2541 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 51 శాతం ఉత్తీర్ణత శాతం నమోదయింది. ద్వితీయ సంవత్సరంలో4303 విద్యార్థులు పరీక్షలు రాయగా 2583 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 60శాతం ఉత్తీర్ణత శాతం నమోదయింది.

ఖర్చులతో భయపెట్టే జూన్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జూన్ నెల వచ్చిందంటే సామాన్యులకు దడ మొదలైనట్లే. స్కూళ్ల ప్రారంభం, వ్యవసాయ పనులు ప్రారంభం నేపథ్యంలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం, బ్యాగులు ఇతర సామగ్రి కొనుగోళ్లతో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. మరోపక్క ఖరీఫ్ సీజన్‌లో పత్తి, విత్తనాలు, ఎరువులు, కూలీలకు ఇచ్చేందుకు కూడా పెట్టుబడి పెట్టాల్సిందే. ఆపై నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఒక్కో కుటుంబానికి ఈ నెలలో సుమారు రూ.లక్షకుపైనే ఖర్చు వచ్చి పడుతుంది. చాలీచాలని వేతనాలతో, పైసాపైసా కూడబెట్టుకునే సామాన్యులు ఈనెల గడిచేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు. ఏటికేడు పెరుగుతున్న పాఠశాలు, కళాశాల ఫీజులు, అందుకయ్యే ఖర్చు తలచుకుంటేనే వారి గుండె గుబేల్‌మంటోంది. నెలవారీ జీతాలపైనే ఆధారపడి జీవితాలను నెట్టుకొచ్చే మధ్యతరగతి కుటుంబాలు సతమతమవుతున్నాయి. ముఖ్యంగా ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు ఫీజులు, డొనేషన్లు, బస్సు చార్జీలు, యూనిఫారం, పుస్తకాల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. పైగా ఇతర సామగ్రి ధరలు పెరిగిపోయాయి. కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి పిల్లల పుస్తకాలకు రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. తాము ఎలా ఉన్నా, తమ పిల్లల భవిష్యత్తు బంగారంలా ఉండాలని భావిస్తూ తల్లిదండ్రులు భారంగానే పుస్తకాలు కొంటున్న పరిస్థితి. ఇదే సమయంలో ఇతర ఖర్చులు పెరిగిపోయాయి. విద్యుత్ బిల్లుల నుంచి నిత్యావసరాలు, కూరగాయల ధరలు చుక్కలు చూపెడుతున్నాయి.

ప్రయివేటు దోపిడీ : పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటి ప్రచారాలకు తెర లేపాయి. తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. ఆకర్షణీయంగా కరపత్రాలు పంచుతూ క్యాంపెయిన్ ముమ్మరం చేశాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలనే ఆలోచనలో పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు దగ్గరి పట్టణాల్లోని పాఠశాలలను ఎంచుకునే ప్రయత్నంలో నిమగ్నం కాగా, అక్కడ డొనేషన్లు, ఫీజుల మోతతో భయపడుతున్నారు. యుకెజి, ఎల్‌కెజి స్థాయిలోనే కేవలం ట్యూషన్ ఫీజే రూ.15 వేలకు పైగా ఫీజులు చెబుతుండడంతో వెనక్కి తగ్గుతున్న పరిస్థితి నెలకొంది.

పెన్సిల్ నుంచి పుస్తకాల వరకూ : పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయంటే తల్లిదండ్రులకు గుర్తొచ్చేది ఫీజులు, పుస్తకాలే. ముఖ్యంగా పాఠశాలలో అడుగు పెట్టాలంటే పుస్తకాలు, నోట్ పుస్తకాలతోపాటు వాటిని భద్రపరచుకునేందుకు భారీ బ్యాగులు, దానికి తోడు లంచ్ బాక్స్, పెన్ను, పెన్సిల్.. ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు కొనుగోలు తప్పనిసరి. గతంలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన దుకాణంలో కొనుక్కునేవారు. ఇప్పుడు ప్రయివేట్ పాఠశాలల పంథా మారింది. పుస్తకాలు, బెల్టు, టై, యూనిఫారం అన్నీ ఆయా పాఠశాలల్లోనే కొనాల్సిన పరిస్థితి. పాఠశాలల యాజమాన్యాలు చెప్పిన ధర చెల్లించలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఒకవైపు ఆర్థిక భారం మరోవైపు పిల్లాడి భవిష్యత్తు కోసం మౌనంగానే ముందడుగు వేస్తున్నారు. అడ్మిషన్ నుంచి తరగతి గదిలో అడుగు పెట్టేంత వరకు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు కరువైపోతుందని వాపోతున్నారు.

వ్యవసాయం భారమే : జూన్ నెలలో వ్యవసాయ పనుల్లో పెట్టుబడి పెట్టాల్సిందే. ఒక ఎక రాకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు ఖర్చు పెట్టాల్సిందే. అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల పెట్టుబడి పెట్టినా చేతికి రాక అప్పుల పాలవక తప్పదు. మరో వైపు నకిలీ విత్తనాల బెడద వెంటాడుతోంది. జూన్ నెల అంటేనే రెండు పక్కల ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

బదిలీల బేరం : ఉద్యోగుల బదిలీలను అసరా చేసుకొని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. కీలక శాఖలల్లో బదిలీ చేయించేందుకు రూ.లక్షలల్లోనే డిమాండ్ చేస్తున్నారు. సిపార్సు లేఖలు ఉన్న వారిని బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. రెవెన్యూ, సర్వే, పంచాయితీరాజ్ ఇతర శాఖలల్లో ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఉద్యోగుల బదిలీల కోసం తమకు కావాల్సిన స్థానాలకు వచ్చేందుకు సిపార్సు లేఖలను పొందుతున్నారు. ఈ సిపార్సు లేఖలను తీసుకునేందుకు కూటమి నేతలు చుట్టూ తిరుగుతున్నారు. ఏ నియోజికర్గంలో రావాలనుకుంటే అ నియోజికవర్గ ఎమ్మెల్యే సిపార్సు లేఖలను తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే సిపార్సు లేఖలు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున వసూళ్ల చేస్తున్నారు.





ఇంటర్ సప్లిమెంటరీలో 'శ్రీ చైతన్య' విజయప్రస్థానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్ ప్రథమ సంవత్సర సప్లమెంటరీ పరీక్షా ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారని కళాశాలల ఎజిఎం మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపిసి విభాగం లో 470 మార్కులకు గాను బి. యశస్విని 467తో జిల్లాలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కె.హర్శిత 466, జి. అభిలాష్ 466, ఎ. మరియమ్మ 466, ఎం. ముజాహిద్ 466 , మనియార్ సమ్రీన్ బేగం 466, ఎం. లిఖిత 466, , జి. లావన్య 466 , ఎస్. దేవవర్శిని రెడ్డి 466, డి.గౌరి ప్రశాంత్ 466 మార్కులు సాధించారని తెలిపారు. ఎంపి విభాగంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి 420, ఆ పైన మార్కులు సాధించారని తెలిపారు.జూనియర్ బైపిసి విభాగం లో 440 మార్కులకు గాను బి. జ్వలిత 436 మార్కులు, ఎస్.సదాఫ్ 436 మార్కులు, కె. భావన 436, డి. పల్లవి 435, ఎమ్. సనాఫాతిమా 435, పి.హెచ్.దీప్తి రెడ్డి 435, కె. చరిత 435, డి. సమీనా 435, జి. వర్శిని 435, ఆర్. ఖాతూన్ 435, కె. స్నేహిత 435, సువంశిక 435, కె. శిరీశ 435, ఎస్. అతయా తహ్రీమ్ 435మార్కులు సాధించారని తెలిపారు.బైపిసి విభాగంలోపతి ముగ్గురిలో ఒకరికి 410 ఆపైనమార్కులు సాధించారని తెలిపారు.

బక్రీద్ సందర్భంగా అన్నదానం


ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



బక్రీదును పురస్కరించుకొని శనివారం కర్నూలు ఓల్డ్ ఏజ్ హోంలో నిర్వాహకులు అబ్రహం అధ్యర్వంలో స్మైలీ ఫౌండేషన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని ఎపి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ముంతాజ్, సమీ బాషా అన్నారు. ఆమె మాట్లాడుతూ... ప్రతి మనిషి సేవాభావాన్ని కలిగి ఉండాలని అన్నారు. పేదలకు చేతనైన సాయాన్ని అందించాలన్నారు. చేసే సాయం చిన్నదైనా అది మనిషికి ఎంతో పెద్ద సంతోషాన్ని, సంతృప్తిని కలిగిస్తుందన్నారు. ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు, అనాథలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. అబ్బాస్, షేక్షావలి, షాషావలి, రెహాన్ పాల్గొన్నారు.

10న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్




స్వస్త్ హోమియో వైద్యాలయ ఆధ్వర్యంలో ఉచిత ఎముకల పటుత్వ పరీక్ష (బిఎండి) శిబిరం నిర్వహిస్తున్నామని డాక్టర్ ఎస్.ధీరజ్ గౌడ్, ఎండి (హోమియో) తెలిపారు. రూ.1950 విలువగల పరీక్ష స్వస్త్ హోమియో కేర్ ఆధ్వర్యంలో ఈనెల 10న మంగళవారం ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 2.30 వరకు కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ, పంప్ హౌస్ దగ్గర వున్న స్వస్త్ హోమియో కేర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఈకింది ఫోన్ నెంబర్లలో సంప్రదించాని కోరారు. 9494202048, 9494202086.

భారాలు వేయడంలో తేడా లేదు..

-పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



బాధితులతో మాట్లాడుతున్న పుల్లారెడ్డి

గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేదని ప్రజలపై భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి ,మాజీ కార్పొరేటర్ ఎ.బాలరాజు అన్నారు. శనివారం కోర్టు సమీపంలోని కాలనీలలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ప్రజలతో సంభాషణ యాత్ర నిర్వహించారు. రోడ్డు లేక మురుగు కాలువ పై వెళ్లే పేదల ఇంటికి పన్ను పెంచారని, రోజు కూలిపై బతికే వాళ్ళం ఇంటి పన్ను, కరెంటు చార్జీలు తగ్గించాలన్నారు. గత ప్రభుత్వానికి.. కూటమి ప్రభుత్వానికి తేడా కనిపించడం లేదన్నారు. భర్తకు అనారోగ్యం, చిన్న ఇల్లు, ఇంటి ముందు రోడ్డు లేదు..మురుగు కాలువపై బండలు వేసుకొని ఇంట్లోకి వెళ్తున్నారని, రూ. రెండు వేల వరకు ఇంటి పన్ను చెల్లించాలంటున్నారని పద్మ అనే పేద మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. 'మేము బీడీ పని, రోజు కూలి పై జీవిస్తున్న మాపై కరెంటు చార్జీలు మీ ఇండ్ల పన్నుల భారం వేస్తే ఎలా బ్రతకాలి? పిల్లలను ఎలా చదివించుకోవాలి ? అంటూ పూజ, పార్వతమ్మ, లక్ష్మీదేవి అనే మహిళలు ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ధనిక తేడా లేకుండా ఇండ్ల పన్నులు కరెంటు చార్జీలు పెంచుతున్నారని అన్నారు. మంచం పట్టేంత ఇల్లు కూడా లేని దళితులపైన, పేదల పైన ఇంటి పన్నులు, కరెంటు చార్జీలు పెంచడం భావ్యం కాదన్నారు. గత ప్రభుత్వ బాటలోనే కూటమి ప్రభుత్వం కూడా పయనిస్తుందని విమర్శించారు. ఇంటింటికి తిరిగి సర్వే చేయమని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ జోక్యం చేసుకొని పేదవాళ్లను గుర్తించి వడ్డీతో సహా ఇంటి పన్నులు, రద్దు చేయాలని కోరారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ ఎ.పద్మావతమ్మ, పిపిఎస్ఎస్ నాయకులు ఎ. వెంకటేశ్వర్లు, ఎస్. రమణ గౌడ్, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ,కార్మికుల పాలిట శరాఘాతం

కార్మికహక్కులపై దాడి...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జులై 9న సార్వత్రిక సమ్మెకు కార్మికలోకం సన్నద్ధమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ అనుచితనిర్ణయాన్ని ప్రతిఘటించి తీరుతామని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, రీజినల్ ద్వారా అధ్యక్షులు ఎండి.అంజిబాబు రీజినల్ కార్యదర్శి వి.సంజీవ రాయుడు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మిక హక్కులపై దాడి చేస్తూ క్యాబినెట్ నిర్ణయం చేసింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్లకు రెడ్ కార్పొరేట్ పరుస్తూ కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను ఒక్కసారిగా దిగమిగింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సమావేశమైన కూటమి మంత్రివర్గం ఏడాది తర్వాత ఒరాష్ట్రంలోని కార్మికుల ఆరోగ్యాన్ని, ఆనందాన్ని కబళించి వారి మూలగలను మరింత పీల్చి పిప్పి చేసే నిర్ణయాన్ని తీసుకున్నదన్నారు. ఈ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. నిర్ణయాలు అమలు కోసం పరిశ్రమల చట్టం (1948), ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని సెక్షన్ల నిబంధనలకు మార్పులు చేయాలనే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. తాజా నిర్ణయం అమలు ప్రకారం ఎనిమిది గంటల పని బదులు పది గంటలు పని చేయాల్సి ఉంటుందన్నారు. కార్మికుల ఇష్ట ప్రకారం చేయాల్సిన అదనపు పనిని (ఓవర్ టైం) యజమానుల ఇష్టంగా, నిర్బంధ పనిగా మార్చి వేశారన్నారు. ప్రతి ఐదు గంటల పని తర్వాత అరగంట విశ్రాంతి అమలులో ఉన్న నిబంధనకు మార్పు చేసి మరో గంట తర్వాత విశ్రాంతి! అరగంట విశ్రాంతి కోసం ఏకధాటిగా ఆరు గంటలు చెమటోడ్చాల్సి ఉంటుందన్నారు. సాధికారిత పేరుతో మహిళల రాత్రి వేళ డ్యూటీలకు చట్టబద్ధంగా అనుమతి ఇచ్చారన్నారు. మహిళలకు నైట్ షిఫ్ట్ పని ఇక తప్పనిసరి చేశారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మే డే స్ఫూర్తిగా కార్మికులు రక్తం చిందించి సాధించుకున్న ఎనిమిది గంటల పని ఎన్నో ఏళ్లుగా అమలవుతున్నదన్నారు. కార్మికుల త్యాగాలతో దక్కిన ఈ హక్కుకు చరమగీతం పడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గర్హనీయం! ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్టాఫ్‌అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వ్యతిరేకిస్తున్నదన్నారు. ఈ చర్యకు నిరసనగా ఎస్‌డబ్ల్యుఎఫ్ చేపట్టబోయే ఉద్యమంలో ఉద్యోగ కార్మికులు భాగస్వాములు కావాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ విజ్ఞప్తి చేస్తున్నదని చెప్పారు.

తెలంగాణ డిప్యూటీ సీఎం కు ఘనంగా స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి శాశ్వత ఆహ్వానితులు గిడుగు రుద్రరాజులకు నంద్యాల డిసిసి అధ్యక్షులు జె. లక్ష్మీ నరసింహ యాదవ్, కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానిబాష ఆధ్వర్యంలో శనివారం ఘన స్వాగతం పలికారు. నంద్యాల జిల్లా పిన్నాపురం సోలార్ పవర్ ప్లాంట్ పర్యవేక్షణకు కర్నూలు మీదుగా వెళుతున్న భట్టి విక్రమార్క ఉమ్మడి జిల్లా నాయకులు పుల్లూరు టోల్ ప్లాజా వద్ద పూలమాలలతో, శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. గుండ్రేవుల ప్రాజెక్టును త్వరగా పూర్తిచేస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు నీటి కష్టాలు తీరుతాయని ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని అనంతరత్నం మాదిగ భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేంద్ర నాయుడు, నంద్యాల డిసిసి ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, జిల్లా కిసాన్ సెల్ మాజీ అధ్యక్షులు పోతుల శేఖర్, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఎన్.సుంకన్న, జిల్లా ఎస్‌సి సెల్ మాజీ అధ్యక్షులు ఇ లాజరస్, తదితరులు ఉన్నారు.



టోల్‌ప్లాజా వద్ద బట్టి విక్రమార్కుకు స్వాగతం పలుకుతున్నకాంగ్రెస్ నేతలు




మంచి మార్కులు సాధించిన విద్యార్థుతో కళాశాల డిజిఎం, డీన్లు, ప్రిన్సిపల్స్

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీలో 'నారాయణ' ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో కర్నూలు నారాయణ విద్యార్థులు మార్కుల పెరుగుదలతో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని నారాయణ కళాశాలల కోర్ డీన్ పి.లింగేశ్వర రెడ్డి తెలిపారు. అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచిన వారిలో జూనియర్ బైపిసి విభాగంలో 436 మార్కులతో అగ్రస్థానాన్ని సాధించిన విద్యార్థులు ఎమ్. సహారా, జి. సరియు, షేక్ బొంతల సనా, ఎరమ్ రక్షాన్, షేక్. నసిఫా, పోతినేని యషిత ఉన్నారు. 435 మార్కుల పైగా స్కోర్ చేసిన విద్యార్థులు 23 మంది, 430 మార్కుల పైగా 113 మంది, 420 మార్కుల పైగా209 మంది,400 మార్కుల పైగా 319 మంది సాధించి 97.85 ఉత్తీర్ణత శాతం సాధించారని తెలిపారు. జూనియర్ ఎంపిసిలో విభాగంలో 467 మార్కులతో అగ్రస్థానాన్ని సాధించిన విద్యార్థులు వి.హర్షిత, హఫీజ్, ఎండి. తౌసిఫ్, పి.సుగంధిని రెడ్డి, ఎన్. శివ చక్రధర్ సాధించగా 466 మార్కుల పైగా స్కోర్ చేసిన విద్యార్థులు 28 మంది, 465 మార్కుల పైగా 75 మంది, 460 మార్కుల పైగా 396 మంది, 450 మార్కుల పైగా 870 మంది, 420 మార్కుల పైగా 1659 మంది, 400 మార్కుల పైగా 2028 మంది మొత్తం 97.64 ఉత్తీర్ణత శాతం సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ నారాయణ కళాశాల విద్యార్థులు ఎంపిసి విభాగంలో 99.15 ఉత్తీర్ణత శాతం, బైపీసి విభాగంలో 99.09 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డిజిఎం టి. గోవర్ధన్ రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, డి.వేణు గోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్స్ బి. విజయ మోహన్, సాంబశివ రెడ్డి, సుధాకర్ రెడ్డి లు పాల్గొన్నారు.



దేవాలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పెద్దపాడు రోడ్డులోని ఎపి ఆదర్శ పాఠశాల పక్కన నిర్మాణం లో ఉన్న శ్రీ భీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి కల్లూరు కె.ఉమామహేశ్వర్ రూ.25,000 నగదును కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె. రంగస్వామి, సహాయ కార్యదర్శి బిసి. తిరుపాల్ సమక్షంలో శనివారం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ , విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలను ఇవ్వాలని కోరారు.


నిరసన శిబిరంలో మాట్లాడుతున్న ఈరన్న

అర్ధాకలితో ఎన్నాళ్లు జీవించాలి..?

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న
- నాలుగో రోజూ మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఆదోని

చాలీచాలని వేతనాలతో కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక అర్ధాకలితో జీవిస్తూ విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఎన్ని సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో పోరు బాట పట్టామని స్పష్టం చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారానికి అడుగులు పడే వరకు పోరు కొనసాగిస్తామని చెబుతున్నారు. మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్లు చేపట్టిన నిరసన దీక్ష శనివారం నాలుగో రోజూ సాగింది. దీక్ష శిబిరానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ అధ్యక్షులు పిఎస్.గోపాల్, ఎఐటియుసి నాయకులు అజయ్ బాబు, నాగరాజు, వెంకప్ప, యుటిఎఫ్ నాయకులు సునీల్ రాజ్ కుమార్ చేరుకొని సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ... అవసరాలు తీర్చుకొనేందుకు కూడా జీతాలు చాలడం లేదన్నారు. ప్రభుత్వానికి వారి ఆకలి కేకలు వినపడడం లేదా అంటూ నిలదీశారు. జీతాలు పెరిగేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. 10 ఏళ్లకు పైగా సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఎఐటియుసి నాయకులు అజయ్ బాబు మాట్లాడుతూ... సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పీరా సాహెబ్, సోమన్న, సీనియర్ నాయకులు అహ్మద్, భరత్, ఈరన్న, రామాంజనేయులు, ఆంజనేయులు, కుమార్, కర్రెప్ప, శరత్, శంకర్, మహ్మద్, బసవరాజు, దేవేంద్ర, శివకుమార్ ఉన్నారు.

'కార్మికులను పనిలోకి తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు

విశాఖ ఉక్కులో తొలగించిన 2,500 మంది కాంట్రాక్టు కార్మికులను పని లోకి తీసుకోవాలని, ఈనెల 9న విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు కార్యదర్శి పి.గోవిందు, బి.రాముడు, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు ఎస్.బాలరాజు, రైతు కూలీ సంఘం జిల్లా, తాలూకా నాయకులు ఎం.సత్తన్న, జయన్న కోరారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు బి.ఏసేపు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ ఆంధ్రుల హక్కు అని, విశాఖ ఉక్కు దేశంలోనే అతి పెద్ద పరిశ్రమగా చరిత్రలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ పరిశ్రమను కాపాడుకోవడానికి ఎంతో మంది ప్రాణాలకు తెగించి ఆంధ్రులకు ఆస్తిగా ఇచ్చారని తెలిపారు. నేడు బిజెపి ప్రభుత్వం విశాఖపట్నం పరిరక్షణ కోసం ఎలాంటి ప్యాకేజీ ఇవ్వకపోవడం, బడ్జెట్ కేటాయించకపోవడం, సొంత గనులు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. విశాఖ ఉక్కును ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రయివేటీకరించబోమని కేంద్ర పరిశ్రమల మంత్రి పలుమార్లు ప్రకటించారని తెలిపారు. ఆచరణలో కార్మికులను తగ్గించడానికి యజమాన్యం అనేక కుట్రలు చేస్తోందని విమర్శించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా 2500 మంది కార్మికులను తొలగించారని తెలిపారు. విశాఖ ఉక్కుపై అఖిలపక్ష కమిటీ సమావేశం వేయాలని, కార్మిక సంఘాల రాష్ట్ర ప్రతినిధులను పిలిపించి తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.రాజు, యు.రమేష్, జయన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ.. ప్రజల దాహార్తిని తీర్చండి

- న్యాయవాది తిమ్మప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పట్టణంలో నాలుగు రోజుల నుంచి తాగు నీటిని వదలకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని న్యాయవాది, సామాజిక ఉద్యమ కార్యకర్త అడ్డాకుల తిమ్మప్ప కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. పట్టణంలో అనేక వార్డుల్లో తాగునీరు కుళాయిల ద్వారా వదలకపోవడంతో ప్రజలకు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మె మూలంగా తాగునీటి సరఫరా పూర్తిగా ఆగిపోయిందని చెప్పారు. పట్టణమంతా తాగు నీటి సరఫరా సమస్యను ఎదుర్కొంటున్నారని, ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే ప్రజలు ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తారని హెచ్చరించారు.

చైర్మన్ గిరి ఆలస్యంలో

ఆంతర్యమేమిటి..?

- ఆదోని మార్కెట్ యార్డు పదవిపై ఆశావాహుల్లో ఉత్కంఠ
- అదిగో.. ఇదిగో... అంటూ నాన్చుతున్న ప్రభుత్వం


ప్రజాశక్తి-ఆదోని రూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ పాలకమండలి చైర్మన్ పదవి ఆశావహులను ఊరిస్తోంది. ఎవరికి వారు తమకే పదవి వస్తుందని, ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. కూటమి సర్కారు మాత్రం ఎటూ తేల్చ కుండా నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తోంది. దీంతో ఆ కుర్చీ ఎవరికి దక్కుతుందోనని ద్వితీయ శ్రేణి కూటమి నేతలు వేచి చూస్తున్నారు...

రాయలసీమలోని అతిపెద్ద ఆదోని మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని బీసీ మైనార్టీ మహిళలకు రిజర్వేషన్ కేటాయించింది. ఇప్పటికే రాష్ట్రంలో మూడు విడతలుగా ఆయా పాలకమండల వర్గాలను నియమించినప్పటికీ ఆదోని నియోజకవర్గం ఎటు తేల్చలేకపోతున్నారు. పక్క నియోజకవర్గాల్లో ఎమ్మిగనూరు,పత్తికొండ పాలకమండలిని పూర్తి చేసినప్పటికీ ఆదోని మార్కెట్ యార్డ్ పాలకమండలిని పెండింగ్ పెట్టడం వెనక ఆంతర్యమేంటని ప్రజలు చర్చించుకుంటున్నారు. చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలకమండలి చైర్మన్ పదవి కోసం ఆరుగురు పోటీ పడుతున్నారు. ఆర్థికంగా మంచి పలుకుబడి ఉన్నవాళ్లకే ఇస్తే అభివృద్ధికి దోహద పడతారనే వాదనలు మరోవైపు గట్టిగా వినిపిస్తున్నాయి. టిడిపి పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి మీనాక్షి నాయుడు వర్గం నుంచి ఆరెకల్ రామకృష్ణ సతీమణి మాజీ సర్పంచ్ ధనలక్ష్మి, మాజీ నియోజకవర్గ ఇన్చార్జి గుడిసె కృష్ణమ్మ వర్గం నుంచి ఆమె సోదరుడు శ్రీరాములు సతీమణి, మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ మదిరె భాస్కర్ రెడ్డి వర్గం నుంచి మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఫక్రుద్దీన్ సతీమణి, జనసేన పార్టీ నుంచి నియోజకవర్గ ఇన్చార్జి జనసేన మల్లప్ప సతీమణి శ్రీవాణి, బిజెపి నుంచి నాగరాజ్ గౌడ్, కునిగిరి నీలకంఠ సోదరులు, మరోవైపు టిడిపి సీనియర్ నాయకులు అప్సర్ భాష కుటుంబ సభ్యులకు చైర్మన్ సీటు కేటాయించాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. చైర్మన్ పదవి కోసం గట్టి పోటీనే నెలకొంది.

రికార్డు స్థాయిలో ఆదాయం

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి 105 శాతాన్ని సముపార్జించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.17.10 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా మార్చి 15 నాటికే రూ.17.20కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రాయలసీమ జిల్లాల్లోని మార్కెట్ కమిటీలలోనే ఆదాయపు వసూళ్ల లక్ష్యాన్ని మించి అగ్రశ్రేణిగా నిలిచింది. ఈ లెక్కన ప్రత్యక్షంగా రూ.1720 కోట్ల లావాదేవీలు జరిగాయి. రాష్ట్రంలోని గుంటూరు మార్కెట్ తర్వాత ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి అంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలాంటి మార్కెట్ యార్డ్‌కు చైర్మన్ పదవికి పోటీ తీవ్రత నెలకొంది. చివరికి ఆ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.



నేడు సీనియర్ సిటిజన్లతో యోగాంధ్ర : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని



సీనియర్ సిటిజన్లతో ఆదివారం ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విధానంలో 'యోగాంధ్ర' నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడేలా చూస్తున్నట్లు తెలిపారు. యోగా ఆరోగ్యవంతమైన జీవనశైలి అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. ప్రభుత్వ అధికారులతో పాటు, స్వచ్ఛంద సంస్థలు, యోగా గురువులు, సామాజిక కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ రమేష్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మరమాన్ దొడ్డి తండాకు చెందిన ఎస్.రమేష్ నాయక్ కర్ణాటక నుంచి కర్ణాటక మద్యం 96 ఒరిజినల్ ఛాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను ద్విచక్ర వాహనం (హోండా షైన్ ఎపి 39 జెఎ 1343)లో అక్రమంగా తరలిస్తుండగా మాధవరం గ్రామ సమీపంలో తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుని అదుపులోకి తీసుకొని, జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో సిఐ రమేష్ రెడ్డి, ఎస్ఐ రాయుడు, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుల్ కరుణాకర్ పాల్గొన్నారు.

జోనల్, అంతర్ జిల్లా పోటీలకు క్రీడాకారులు

ప్రజాశక్తి - ఆదోని

జోనల్, అంతర్ జిల్లా క్రికెట్ అండర్-15, అండర్-19 టోర్నమెంట్‌కు ఆదోని పట్టణానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. క్రీడాకారులకు తమ సహకారం ఉంటుందని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టా రమేష్ తెలిపారు. శనివారం క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను భీమాస్ హోటల్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా అండర్-15 క్రికెట్ బాలికల జట్టుకు జ్యోత్స్న, మేఘనా రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వీరు ఈనెల 9 నుంచి 15 వరకు నెల్లూరు జిల్లాలో జరిగే జోనల్ క్రికెట్ పోటీల్లో జిల్లా తరపున ఆడతారని తెలిపారు. ఈనెల 10 నుంచి 16 వరకు కడపలో జరిగే అండర్-19 జోన్ అంతర్ జిల్లాల పోటీల్లో అక్షయ, రవితేజ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఇక్కడ ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర జట్టుకు ఎంపికవుతారని తెలిపారు. తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ముజీబ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి పులికొండ వెంకటేష్, బాష, కోచ్ బాలాజీ రావు ఉన్నారు.


క్రీడాకారులతో నాయకులు

వైభవంగా శ్రీకూర్మ నారాయణ జయంతి

ప్రజాశక్తి - ఆస్పరి


మండలంలోని హాలిగేర గ్రామ కొండలో వెలసిన శ్రీకూర్మనారాయణ స్వామి జయంతి వేడుకలను ఆలయ నిర్వాహకులు నరేష్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శనివారం అర్చకులు రమేష్ ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, చందనాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీ అష్టోత్తర సహితి, శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం చేశారు. గిరి ప్రదక్షిణలో భాగంగా స్వామి వారి పల్లకితో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేస్తూ నాగ దేవతల పుట్టలకు పూజలు నిర్వహించారు. అతి ప్రాచీనమైన రావి వృక్షానికి పూజలు, శమీ వృక్ష పూజ, అమృత, కలశ పూజ, స్త్రీ అవధూత హనుమప్ప తాతకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేయించారు. ఉత్సవాలకు ఆయా ఆశ్రమాలకు చెందిన 19 మంది పీఠాధిపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతులు భక్తులకు కొన్ని సూత్రాలు బోధించారు. గంగావతికి చెందిన హరే శ్రీనివాస కోలన్న బృందం ఆధ్వర్యంలో మహిళల కోలన్నలాటలు ప్రజలు, భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతాప్ రెడ్డి, దత్తాత్రేయ రెడ్డి నాయుడు, ప్రసాద్ రెడ్డి, నాగయ్య, రంగస్వామి, అనిమేష్ పాల్గొన్నారు.


పీఠాధిపతులను దర్శించుకున్న భక్తులు

ఆలయానికి రోడ్డు ఏర్పాటు

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

మండలంలోని హాలిగేర గ్రామ కొండల్లో వెలసిన శ్రీకూర్మ నారాయణ (నల్లగుట్టయ్య) ఆలయానికి సిసి రోడ్డు వేయిస్తానని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. శనివారం శ్రీకూర్మ నారాయణ జయంతి వేడుకలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం 19 పీఠాధిపతులను దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఉత్తర ద్వారం ముఖం ఉన్న దేవాలయం తమ నియోజకవర్గంలో ఉండడం సంతోషంగా ఉన్నారు. ఇలాంటి ప్రాచీనమైన దేవాలయాలను అభివృద్ధి చేసుకుంటే తాలూకా కూడా అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. శ్రీకూర్మ నారాయణ క్షేత్రానికి వెళ్లేందుకు రహదారి ఇబ్బందిగా ఉండడంతో వచ్చే ఆరు నెలల్లో సిసి రోడ్డు వేయిస్తానని హామీఇచ్చారు. అనంతరం వీరభద్ర గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. టిడిపి మండల కన్వీనర్ పరమా రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, సాగునీటి సంఘం చైర్మన్ బసవరాజు, యుగంధర్, సతీష్ కుమార్, ముత్యాల రెడ్డి, మధు, రంగనాథ్, రాజ్ కుమార్, ఎల్లప్ప, మహేష్, రామాంజనేయులు, నాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.


వీరభద్ర గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అధ్యయనం చేసేందుకే గ్రంథాలయాలు

- విశ్రాంత ఎంఇఒ రామలింగమ్మ

ప్రజాశక్తి - ఆలూరు


తెలియని విషయాలను అధ్యయనం చేసేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని విశ్రాంత ఎంఇఒ హత్తి బెళగల్ రామలింగమ్మ, విశ్రాంత డిపిఒ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆలూరు గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమం చేపట్టారు. గ్రంథాలయ అధికారి కె.భాస్కర్ ఆధ్వర్యంలో పెద్దకడబూరు మండలంలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ గణితోపాధ్యాయులుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త బాలబంధు డాక్టర్ గద్వాల సోమన్న రచించిన 'సూక్తి చంద్రిక' పుస్తకావిష్కరణ చేపట్టారు. బాలల కోసం గ్రంథాలయ సంస్థ ఏర్పాటు చేసిన 'సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమం'లో భాగంగా రామలింగమ్మ, శ్రీనివాసులు మాట్లాడారు. సమాజంలో జరిగిన విషయాలు, భవిష్యత్తులో జరగబోయే విషయాలు, చరిత్ర, సైన్స్ ఎన్నో విషయాలను అధ్యయనం చేయాలంటే ఆది ఒక్క గ్రంథాలయంలోనే సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం గ్రంథాలయంలో రిటైర్డ్ ఆర్మీ నర్సిరెడ్డి యోగాసనాలు వేయించారు. రిటైర్డ్ గ్రంథాలయ అధికారి నీరిగంటి వెంకటేశ్వర్లు 10వ తరగతిలో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ముగింపు సందర్భంగా విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, ఈరన్న, దేవదానం, బాటప్ప, పద్యకవి ఈశ్వరప్ప, తెలుగు భాషోపాధ్యాయులు మల్లికార్జున, మహదేవి, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొని గద్వాల సోమన్నను అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు


భక్తిశ్రద్ధలతో బక్రీద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో శనివారం బక్రీద్ పండగలో భాగంగా ఈద్ నమాజ్ ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పట్టణంలోని 60 మసీదుల్లో ఈద్ నమాజ్ నిర్వహించినట్లు పట్టణ ఖతిబ్ సాబ్ జునేద్ హాష్మి తెలిపారు. పట్టణంలోని షాహి జామియా మసీదు, పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలకు వేలాదిమంది ముస్లింలు హాజరయ్యారు. మసీదులో ఖతిబ్ సాబ్ జునేద్ హాష్మి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో బక్రీద్ పండగ సందర్భంగా ఈద్ నమాజులు ఉదయం 6.20 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని 60కి పైగా ఉన్న మసీదుల్లో ఆయా సమయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే కొండలో వెలసిన తాహెర్‌షా ఖాద్రీ దర్గాలో కూడా ప్రత్యేక ఈద్ నమాజ్ ప్రార్థనలు జరిగాయి. అలాగే వాడవాడలా కుర్బానీ కార్యక్రమం పట్టణంలోని ప్రజలు నిర్వహించారు. మండలంలోని పెద్దతుంబలం, పెద్ద హరివాణం, సంతేకుడ్లూరు, హానవాల్ తదితర గ్రామాల్లో కూడా ఈద్ నమాజ్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో మసీదుల వద్ద సిఐలు శ్రీరామ్, రామలింగయ్య, రాజశేఖర్ రెడ్డి, నల్లప్ప, గంటా సుబ్బారావు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **చిప్పగిరిలో** సయ్యద్ అబ్దుల్ సత్తార్ హాది ఖాద్రీ వంశీయులు సయ్యద్ హర్షద్ ఖాత్ర హితబోధ చేశారు. చిప్పగిరిలోని భం భం సాహెబ్ దర్గా వద్ద ఉన్న ఈద్గాలో బక్రీద్ పండగ సందర్భంగా నమాజ్ చదివించారు. నేమకల్లులో ముస్లింలంతా బస్టాండ్ దగ్గర ఉన్న ఈద్గా దగ్గరకొచ్చి భక్తిశ్రద్ధలతో నమాజు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డాక్టర్ సయ్యద్ ఆరిఫద్దీన్ ఖాద్రీ, ముల్లా పెద్ద సత్తార్ వలీ, మునాఫ్, కోఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్, గుడ్డం సుల్తాన్, అంగిడి హుస్సేని, వలీ సాహెబ్, ముద్దప్ప బాష, చాందు, మాబు హుస్సేని, లాలప్ప, కలందర్, శర్మస్ వలీ పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని జామీయ మసీదు ఇమామ్ ఖాజా బందేనమాజ్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పండగ ప్రాముఖ్యత గురించి ఇమామ్ చదివి వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **దేవనకొండ** జామీయ మసీదు నుంచి ప్రధాన రహదారుల గుండా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండగ ప్రాముఖ్యతను ఇమామ్ చదివి వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే మండలంలోని తెర్నేకల్, కోటకొండ, గుండ్లకొండ, కరివేముల గ్రామాల్లో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. **కోసిగి** గ్రామ సమీపంలో ఉన్న రైల్వే గేట్ దగ్గర ఈద్గా వద్ద మండలంలోని ఆయా గ్రామాల ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికంగా ఉన్న జామియా మసీద్, నూరాని సున్ని, మదీనా, మసీద్ ఏ అక్సా, అన్వరుల్లా, ఫారూఖీ మసీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా ఈద్గా వద్దకు చేరుకున్నారు. జాకీర్ మౌలానా బక్రీద్ పండగ గొప్పతనాన్ని వివరించారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ మంజునాథ్ ఆదేశాల మేరకు ఎస్ఐ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. **కౌతాళం**లోని జామీయ మసీదు, మదీనా మజీద్, అక్స, నూరాని మజీద్ నుంచి ప్రధాన రహదారుల గుండా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండగ ప్రాముఖ్యత గురించి ఖాజీ చదివి వివరించారు. వర్షం కోసం ప్రత్యేక దువా (ప్రార్థన) చేశారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో నమాజ్ చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే మండలంలోని కుంటనహళ్, బదినే హాల్, నదీచాగి, ఉప్పరహల్, హాల్వి, గుడికంబాలి, కామవరం, ఎరిగేరి గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.


ఆదోనిలో నమాజులో పాల్గొన్న ముస్లింలు


చిప్పగిరిలో...


మంత్రాలయంలో...


దేవనకొండలో...


కోసిగిలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


కౌతాళంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


భక్తులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతులు

శ్రీమఠంలో భక్తుల సందడి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. శనివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు ముద్రాధారణతో ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

అన్నదానానికి విరాళం


శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న అన్నదానానికి భక్తుల నుంచి రూ.1,00,116 విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. కడపకు చెందిన భక్తుడు రామకృష్ణయ్య రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చారు. ఆయన గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని శ్రీమఠంలో నిర్వహిస్తున్న అన్నదానానికి విరాళం అందించినట్లు తెలిపారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు శేష వస్త్రం అందజేసి ఆశీర్వదించారని చెప్పారు.

భక్తులకు వసతి ఏర్పాటులో పీఠాధిపతుల ఔదార్యం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన భక్తులకు వసతి ఏర్పాటులో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఔదార్యం చాటుకున్నారు. శనివారం స్వామి దర్శనానికి దేశ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన నేపథ్యంలో శ్రీమఠం వసతి గృహాలు పూర్తిగా నిండిపోయాయి. ప్రయివేట్ లాడ్జీల ధరలకు రెక్కలు రావడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పీఠాధిపతులు స్పందించి వెంటనే శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీపరిమళ కల్యాణ మండపంలోనూ, టిటిడి కల్యాణ మండపంలోనూ ఉచితంగా వసతి సౌకర్యం ఉందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీమఠం మైక్ ద్వారా ప్రచారం చేయించారు. ఆయన ప్రచారంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యార్థికి సిఎట్ స్టేట్ ర్యాంకు

ప్రజాశక్తి - కౌతాళం



కౌతాళం మండలం గుడికంబాలి గ్రామానికి చెందిన రేణుక, మారెప్ప కుమారుడు కార్తీక్ సిఎట్ (CET)లో స్టేట్ ర్యాంకు సాధించారు. ఇంటర్మీడియట్‌కు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో స్టేట్ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. పులివెందులలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో అర్హత సాధించినట్లు తల్లిదండ్రులు శనివారం తెలిపారు. స్టేట్ ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు కార్తీక్‌కు అభినందనలు తెలిపారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

నూతన విధానంతో అధిక దిగుబడులు

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - మంత్రాలయం

సాగులో నూతన విధానంతో అధిక దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం హార్టికల్చర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వై.మౌనిక, డాక్టర్ ఆర్.భార్గవి తెలిపారు. శనివారం మండలంలోని చిలకలడోన గ్రామంలోని ఆర్‌బికె సెంటర్‌లో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు విధానంలో నూతన పద్ధతులు అవలంభించడం వల్ల దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. మట్టి పరీక్షల అనంతరం సాగులో ఏ పంట అనుకూలమో తెలుస్తుందని, పత్తి, మిరప వంటి పంటల సాగు గురించి అవగాహన కల్పించారు. విఎఎలు మౌనిక, ప్రియదర్శిని, రైతులు పాల్గొన్నారు.